ఆ స్కామ్ 'మట్టి' కొట్టుకుపోయినట్టేనా!

- తెలుగు సినిమాలా సుఖాంతమైన పెద్దోళ్ల భూ కబ్జా కథ
- అతిపెద్ద స్కాంగా అభివర్ణించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్
- అసెంబ్లీలోనే తేల్చుకుంటానంటూ మీడియా ముందు సవాల్
- చెరువులో మట్టి తీయాలంటూ నోటీసులతోనే సరిపెట్టిన హైడ్రా
- మరి రూ.2 వేల కోట్ల విలువైన 27 ఎకరాల సర్కారు భూమి కథేంది?
- పేదోళ్లపై ఉరిమిన హైడ్రా బుల్డోజర్లు ఇప్పుడెందుకు కదలడం లేదు?
- సామాన్యుడికి చట్టాలు వల్లించిన నోళ్లు ఎందుకు పెగలడం లేదు?
- హైకోర్టు చెప్పినట్టు 'పెద్దోళ్లకు ప్రత్యేక చట్టం అమలవుతున్నదా?'

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 26 (నమస్తే తెలంగాణ): 'ఖాజాగూడలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన ప్రాజెక్టు అతిపెద్ద స్కాం. చెరువు బఫర్ జోన్‌లో ఈ ప్రాజెక్టు ఉంది. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తే కనీసం రసీదు కూడా ఇవ్వడం లేదు. ఈ వ్యవహారంపై అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రశ్నిస్తా. ఈ వేల కోట్ల రూపాయల స్కాంపై అసెంబ్లీలోనే తేల్చుకుంటా!'

– అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఈ నెల 13వ తేదీన అసెంబ్లీలో మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో చేసిన సవాల్ ఇది. మరి... నేటితో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. సరిగ్గా మూడు రోజుల కిందట హైడ్రా ఆ ప్రాజెక్టుకు నోటీసులిచ్చింది. చెరువులో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశించింది. అంటే... ఆ స్కాం 'మట్టి' కొట్టుకుపోయినట్టేనా? తెలుగు సినిమాల లెక్క కథ సుఖాంతమైందా? ఇంతటి దానికో సమేనా... అనిరుధ్‌రెడ్డి సవాల్ చేసింది? పేదోడు పది గజాలు ఆక్రమిస్తే బుల్డోజర్లతో విరుచుకుపడిన హైడ్రా, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలు.. ఒకటీ అరా కాదు, రూ.2 వేల కోట్లకు పైగా విలువైన 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రైవేటు ఆకాశ హర్మ్యాలు లేస్తుంటే ఎందుకు కదలడం లేదు? గతంలో సామాన్యులకు నోటీసులిచ్చి పేరాలకు పేరాలు ఆరాలు తీసి... కోర్టు స్టే ఉత్తర్వులను సైతం 'వియ్ డోంట్ కేర్' అన్న హైడ్రా.. ప్రభుత్వ భూమి హారతికర్పూరం అవుతుంటే లెక్కలను బయటికి ఎందుకు తీయడం లేదు? ప్రభుత్వ భూములు చెరబడితే భరతం పడతామన్న ప్రభుత్వ పెద్దల గర్జింపులు ఇక్కడ ఎందుకు వినిపించడం లేదు? ఇటీవల హైకోర్టు వ్యాఖ్యానించినట్టు... ప్రభుత్వ యంత్రాంగం ప్రతాపమంతా పేదోళ్ల మీదనేనా? రాష్ట్రంలో పెద్దోళ్లకు ప్రత్యేక చట్టాలు ఏమైనా అమలవుతున్నాయా? అంటే అక్షరాలా నిజమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. కచ్చితంగా కడుపు మండుతున్న సామాన్యుడు నిగ్గదీసి అడిగే ప్రశ్నలివే. ప్రధాన ప్రతిపక్షం మీద బట్టకాల్చి మీద వేస్తాం... ఆనక అంతా సర్దుబాటు చేసుకుంటామంటే ప్రజలు అమాయకులు కాదు కదా. ఇస్తినమ్మ వాయనం... పుచ్చుకుంటి నమ్మా వాయనం.. అన్నట్టు హైడ్రా నోటీసులు ఇవ్వడం, ఆ సంస్థ మట్టిని తొలగిస్తా మనడం! బారాఖూన్ మాఫీనేనా? ఏదో ఒక చెరువులో మట్టి పోస్తే అది స్కాం కాదనేది చిన్న పిల్లగాడిని అడిగినా చెబుతాడు. మరి... ఎమ్మెల్యే అనిరుధ్ ఆరోపణల వెనుక ఉన్న గుట్టు ఏమిటనేది తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరముంది. లేకపోతే పది మంది పేదల ఇండ్లు కూల్చివేసి ఇదిగో... సమాజానికి 'తరాజు న్యాయం' అందించామనే ప్రవచనాలు వినిపిస్తూనే ఉంటాయి. గత ప్రభుత్వం మీద నెపం నెట్టి 'కార్యాలు' చక్కదిద్దుకునే సంప్రదాయం కొనసాగుతూనే ఉంటుంది.

వాస్తవమిది...

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 27లో సుమారు 64.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 27.18 ఎకరాల భూమిపై 80వ దశకం నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో 2022లో అప్పటి జిల్లా ఉన్నతాధికారి దానికి ఎన్వోసీ ఇవ్వడం.. దాని ఆధారంగా ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్కడ సుమారు 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు టవర్లను నిర్మించేందుకు అనుమతి తీసుకున్నది. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వ పెద్దలు విషయం తెలుసుకొని వెంటనే ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకున్నారు. వాళ్ల ఆదేశానుసారం జిల్లా ఉన్నతాధికారి ఇచ్చిన ఉత్తర్వులను సీసీఎల్ఏ ఉన్నతాధికారి రద్దు చేయడంతో పాటు ఇందులో ఎలాంటి అనుమతులు చెల్లవని కూడా ఉత్తర్వులు ఇచ్చారు. అందులో సదరు రియల్ ఎస్టేట్ సంస్థ వేసిన రేకుల షెడ్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో 2023 డిసెంబరు వరకు ఆ ప్రభుత్వ భూమి సర్కారు ఆధీనంలోనే ఉంది. సదరు సంస్థ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

జరిగింది ఇది...

గత ప్రభుత్వ హయాంలో తమ పప్పులు ఉడకకపోవడంతో సదరు ప్రైవేటు సంస్థ కొత్త ప్రభుత్వం వచ్చాక కొందరిని పట్టుకొని చక్రం తిప్పింది. ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్కదిద్దారు. ఎన్వోసీలు.. అనుమతులు... రెక్కలు కట్టుకొని వచ్చివాలాయి. సదరు సంస్థ ఆ భూమిలోకి దిగి సుమారు ఏడెనిమిది నెలల కిందట ప్రాజెక్టు నిర్మాణ పనులను పరుగులు పెట్టించింది. అందులో భాగంగా పక్కన ఉన్న చెరువు మీదా కన్నేసింది. చెరువులో మట్టి పోసింది. ఇక్కడ చెరువును చెరబట్టడమనేది జరిగిన వ్యవహారంలో చాలా చిన్నది. కానీ, అక్కడ ఏకంగా 27.10 ఎకరాల ప్రభుత్వ భూమితో వ్యవహారం ముడిపడి ఉంది. సాక్షాత్తూ సీసీఎల్ఏ ఉన్నతాధికారి 'అది ప్రభుత్వ భూమి... లావాదేవీలు, నిర్మాణ అనుమతులు చెల్లవు' అని ఉత్తర్వులు ఇవ్వగా... దానికి విరుద్ధంగా అక్కడ వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టు రూపుదిద్దుకోవడమంటే ప్రభుత్వ, అధికార యంత్రాంగం నిద్ర నటిస్తుందనేందుకు ఇంత కంటే నిదర్శనం ఏముంటుంది?

తాజాగా తెరమీదకొచ్చింది ఇలా...

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ నెల 13న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. 'ఖాజాగూడలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్మిస్తున్న ప్రాజెక్టు అతిపెద్ద స్కాం. హైడ్రాకు ఫిర్యాదు చేసినా కనీసం రశీదు ఇవ్వడం లేదు. దీనిని అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తా... అసెంబ్లీలోనే తేల్చుకుంటా' అని బహిరంగంగా సవాల్ చేశారు. అక్కడితో సరిపెట్టకుండా... మహబూబ్‌నగర్‌లో ఏకంగా విలేకరుల సమావేశం నిర్వహించి మరీ మరోసారి ఇదే సంచలన వ్యాఖ్యలు చేశారు. పనిలో పనిగా హైడ్రా నోటీసుల దందా కొనసాగిస్తున్నదని కూడా మరో బాంబు పేల్చారు. దీంతో రాష్ట్ర నిర్మాణ రంగంలో అతిపెద్ద స్కాంను అనిరుధ్ ధైర్యంగా బయటికి తీసుకువస్తున్నారని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. ప్రభుత్వమే అసెంబ్లీ వేదికగా వివరాలు బయట పెట్టి, లోతుగా విచారణ చేసి అసలు వాస్తవాల్ని ప్రజల ముందు పెడుతుందని సామాన్యులు ఉత్కంఠగా ఎదురుచూశారు.

ఈ నామమాత్రపు చర్యలేంది?

ఖాజాగూడ అనేది ఐటీ కారిడార్‌లోని కీలకమైన ప్రాంతం. ఇక్కడ ఎకరం ధర కనీసం రూ.90-100 కోట్ల విలువ ఉంటుంది. అంటే 27.18 ఎకరాల భూమి విలువ రూ.2,000 కోట్లకు పైమాటే! మరి... రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల సుమారు ఏడాదికాలంగా ఏం జరుగుతున్నదో ప్రతి ఒక్కరూ చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వ భూమిలోకి ఇంచు మేర జరిగినా, గజం చెరువు బఫర్‌లో కలిసినా... నిర్దాక్షిణ్యంగా హైడ్రా బుల్డోజర్ల కింద సామాన్యుడి కలల సౌధాలు నలిగిన దృశ్యాలు జనం మదిలోనే ఉన్నాయి. చివరకు గతంలోని హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ఖాతరు చేయకుండా నిర్మాణాలను కూల్చివేసిన దాఖలాలు అనేకం. పది మంది కలిసి 'అది ప్రభుత్వ భూమి, చెరువు శిఖం' అని ఫిర్యాదు చేస్తే చాలు..! నేలమట్టమైన నిర్మాణాలు, న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కిన కేసులు వందల్లో ఉన్నాయి. కానీ, ఇవన్నీ పైకి కనిపించేవే. అధికారం మాటున ఇలా రూ.2 వేల కోట్లకు పైగా విలువైన భూములు పెద్దల చెరలో ఉన్నాయనే ఫిర్యాదులు వచ్చినా పట్టించుకునే దిక్కులేదు. పైగా అధికార పార్టీ ఎమ్మెల్యే... అందునా పవిత్రమైన అసెంబ్లీలో ఉండి మీడియా చిట్‌చాట్‌లో చేసిన ఆరోపణలు. నిగ్గు తేల్చాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం కేవలం నోటీసులిచ్చి 'మట్టి'తో ముడిపెట్టి చేతులెత్తేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. పేదలకు ఒక న్యాయం... పెద్దోళ్లకు మరో న్యాయమా? అని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడకపోగా... ఆ భూమిపై చిన్నపాటి వివరణ ప్రజలకు వెల్లడించడం లేదంటే పేదోళ్ల జీవిత గమనంలో దొర్లే తప్పులను ప్రశ్నించే, ఎత్తిచూపే నైతిక హక్కు ప్రభుత్వ, అధికార యంత్రాంగానికి ఎక్కడిదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరి... ఇంతకీ సదరు సంస్థ కేవలం చెరువులో మట్టి పోసినందుకే ఇది గత ప్రభుత్వ హయాంలో స్కాంగా మారిందా? ఆ 27.18 ఎకరాల భూమి వెనుక అసలు మర్మమేంది?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కేశవాపురం, జగన్నాధపురం గ్రామస్థులు

ఒక గుడి..రెండు జీవోలు

- పాల్వంచ పెద్దమ్మగుడి చైర్మన్ ఎంపికలో విభేదాలు
- భట్టి వర్సెస్ పొంగులేటి
- అయోమయంలో కార్యకర్తలు

పాల్వంచ, మార్చి 26: ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఢీ అంటే ఢీ అంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి చైర్మన్ ఎంపికలో ఇద్దరి మధ్య వర్గపోరు బయటపడింది. పాల్వంచ మండలం జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య ఉన్న కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ కమిటీని ఏటా ఎన్నుకుంటారు. గతంలో చైర్మన్, సభ్యుల ఎంపిక ఎలాంటి విభేదాలు లేకుండా కొనసాగింది. ప్రస్తుతం చైర్మన్ ఎంపికలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. భట్టి అనుచరులతో కూడిన ఆలయ ధర్మకర్తల బోర్డును ఏర్పాటు చేస్తూ మార్చి 6వ తేదీన జారీ చేసిన జీవోను పొంగులేటి ఒత్తిడితో రద్దు చేసినట్టు సమాచారం. భట్టి అనుచరుడు జమ్ముల రాజశేఖర్ సహా మరో 13మందిని పెద్దమ్మగుడి ట్రస్టీల బోర్డుగా నియమిస్తూ జీవో నంబర్ 66 జారీ చేసింది. మంత్రి పొంగులేటి తన అనుచరుడిని ఆలయ చైర్మన్‌గా నియమించాలని కోరడంతో జీవోను పక్షంరోజులపాటు నిలిపివేశారు. మార్చి 19వ తేదీన ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ జీవో 66ను రద్దు చేసి జీవో 112ను జారీ చేశారు. తాజా జీవోలో జమ్ముల రాజశేఖర్ పేరు తొలగించి బాలినేని నాగేశ్వరరావు పేరుతో భర్తీ చేశారు. బాలినేని పేరును ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని ప్రతిపాదించారు. ట్రస్టీల బోర్డు జాబితాలో ఉన్న ఏడుగురి పేర్లను అలానే ఉంచారు. ఈ పరిణామం భట్టి వర్గీయులను కలవరానికి గురిచేసింది. దీనిపై ఆలయ ఈవో రజనీకుమారిని 'నమస్తే' వివరణ కోరగా... రెండో జీవో ఈ నెల 19వ తేదీన విడుదలైందని, దానిప్రకారమే ప్రమాణం స్వీకారం చేస్తారని, తేదీ ఖరారు కాలేదని తెలిపారు.

వాటర్‌ట్యాంకు ఎక్కిన యువకులు

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీలో తమకు సముచితస్థానం లభించలేదని కేశవాపురం, జగన్నాథపురం ప్రజలు బుధవారం ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసేందుకు రాగా ఆ గ్రామాల ప్రజలు ఆలయం వద్దకు చేరుకున్నారు. స్థానికేతరులు, అనుభవంలేని వారికి కమిటీలో స్థానం కల్పించొద్దని నినాదాలు చేశారు. ఇద్దరు యువకులు పక్కనే ఉన్న వాటర్‌ట్యాంక్ ఎక్కడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరికొందరు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. పాల్వంచ సీఐ, ఎస్ఐలు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు.

కుర్చీ కోసం కుమ్ములాట!

- మంత్రి పదవుల కోసం కాంగ్రెస్‌లో బిగుస్తున్న పీటముడి
- ఆయన తమ్ముడికిస్తే.. తన భార్యకూ ఇవ్వాల్సిందేనంటున్న ఉత్తమ్!
- వివేక్‌కు ఎందుకు? మాకు ఇవ్వరా? అంటున్న మాదిగ వర్గం ఎమ్మెల్యేలు
- ఎస్టీలకు ప్రాతినిధ్యం ఉండాల్సిందే.. లంబాడ గిరిజనుల ధర్నాలు
- నా కంటే సీనియర్ ఎవరూ లేరు.. మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలు
- తలపట్టుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం



హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో మంత్రిపదవుల కోసం కుమ్ములాటలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఇటువంటి పరిస్థితిని ఊహించిన అధిష్ఠానం ఇంతకాలం మంత్రివర్గ విస్తరణను జాప్యం చేస్తూ వచ్చిందని, ఇప్పుడు పచ్చజెండా ఊపగానే పరిస్థితి జటిలంగా మారిందని గాంధీభవన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు ఖాళీలుండగా 36 మంది ఆశావహులు పదవులను ఆశిస్తున్నారని, ఎవరిని ఎంపిక చేయాలో తెలియక అధిష్ఠానం పెద్దలు తలలు పట్టుకున్నట్టు ప్రచారం. ఈ ఆరింటిలో ఒక్క దానిపైనే స్పష్టత ఉన్నట్టు, మిగిలిన ఐదు స్థానాలను భర్తీ చేసేందుకు పార్టీ పెద్దలు ఆపసోపాలు పడుతున్నట్టు తెలిసింది. పోనీ తెగించి ముందుగా అనుకున్నవారికే పదవులు కట్టబెడదామనుకుంటే ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకమవుతుందేమోనన్న అనుమానం వారిని పీడిస్తున్నట్టు తెలిసింది.

ఆ రెండు కుటుంబాలతోనే...

ముదిరాజ్ సామాజికవర్గానికి మంత్రివర్గంలో చోటు కలిపిస్తామని ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ మేరకు మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ పేరును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా సూచించినట్టు తెలిసింది. ఈ ఒక్క పేరు విషయంలోనే పార్టీకి క్లారిటీ ఉన్నదని, మిగిలిన వారి విషయంలో పీటముడి వీడటం లేదని అంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నేతల వల్లనే సమస్యలు వస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ జిల్లాలో ఒకే సామాజికవర్గానికి చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మంత్రిపదవిపై తనకు హామీ ఇచ్చారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి పట్టుబట్టి పంతం నెగ్గించుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అలాగైతే తన భార్య పద్మావతికి కూడా మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా పట్టుబడుతున్నట్టు తెలిసింది. ఒకే కుటుంబం నుంచి ఇద్దరిద్దరికి మంత్రి పదవులు అంటే ఎలా అంటూ పార్టీ డైలమాలో పడ్డదని, ఈ రెండు కుటుంబాల వల్లనే సర్దుబాటు క్లిష్టంగా మారిందని సమాచారం. ప్రస్తుత మంత్రివర్గంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. దీంతో మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తమ కర్చీఫ్‌లు వేసినట్టు తెలిసింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అందరికంటే తానే సీనియర్ ఎమ్మెల్యేనని, తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేస్తున్నారు. సామాజిక సర్దుబాట్లలో తనకు ఇవ్వటం సాధ్యం కాకపోతే, తాను రాజీనామా చేస్తానని, అధిష్ఠానం సూచించిన సామాజిక వర్గం నేతను నిలబెట్టి గెలిపించుకుంటానని, అప్పుడైనా రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కాంగ్రెస్ పార్టీకి అల్టిమేటం జారీ చేసినట్టు తెలిసింది.

మా వాట మాకే..

మరోవైపు ఎస్సీ, ఎస్టీలలో కూడా మంత్రి పదవుల లొల్లి మొదలైంది. వివేక్ వెంకటస్వామి పేరు ఖాయమైనట్టు తెలియడంతో మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. మాలల నుంచి ఇప్పటికే డిప్యూటీ సీఎం, స్పీకర్ ఉన్నారని, మళ్లీ వారికే అవకాశమిస్తే తామేం కావాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వివేక్ కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారని, ఇక మంత్రి పదవి కూడా వారికే ఇస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్తున్నారు. ఈసారి మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలె యాదయ్య, తోట లక్ష్మీకాంతారావు, మందుల సామేల్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

మాకేం తక్కువ...

లంబాడ గిరిజన సామాజికవర్గం నుంచి బాలూ నాయక్ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉండటంతో బాలూనాయక్‌కు రూట్ క్లియర్ చేయడం అధిష్ఠానానికి ఇబ్బందిగా మారిందని ప్రచారం జరుగుతున్నది. మంత్రివర్గంలో తమ వర్గానికి చోటు కల్పించాలని డిమాండ్ చేస్తూ లంబాడ గిరిజన సంఘాలు హైదరాబాద్, దేవరకొండ తదితర ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించాయి. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్, సీనియర్ ఎమ్మెల్యే నెహ్రూ నాయక్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌లలో ఒకరికి స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వారు ఏఐసీసీకి, రేవంత్‌కు వినతిపత్రాలు అందించారు.

ఆ ఒక్కరికి ఇస్తే చాలు..

క్యాబినెట్ విస్తరణ కత్తిమీద సాములా మారిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి భారం మొత్తం అధిష్ఠానం మీదనే వేసినట్టు తెలిసింది. అయితే తన పక్షాన సీనియర్ కాంగ్రెస్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరును సూచించినట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది. తమకు చెక్ పెట్టడానికే సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా సుదర్శన్‌రెడ్డి పేరును సూచించారని, సీనియర్ కాంగ్రెస్ నేతలు దొంతి మాధవరెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు గుర్రుగా ఉన్నట్టు పార్టీ సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ మంత్రిని తొలగిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. 'తొలగిస్తే తానేంటో చూపిస్తా' నని సదరు అమాత్యుడు సవాల్ విసిరినట్టు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

కొత్తగూడెంలో ఎర్త్‌సైన్స్ వర్సిటీ

- వర్సిటీగా అప్‌గ్రేడ్ కానున్న మైనింగ్ కాలేజీ
- ఈ వారంలోనే జీవో జారీ చేయనున్న సర్కారు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఎర్త్ సైన్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ఎర్త్‌సైన్స్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేయనున్నది. సంబంధించిన జీవో ఈ వారంలోనే విడుదలకానున్నది. వర్సిటీ ఏర్పాటుకు రూ. 500 కోట్లు, 100 పోస్టులు అవసరమని ఉన్నత విద్యామండలి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ వర్సిటీలో మైనింగ్, ఎర్త్ సైన్స్, జియాలజీ, ఏఐ వంటి కోర్సులను ప్రవేశపెడతారు. దేశంలో ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని నిర్వహిస్తున్నారు. కొత్తగూడెంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చినా ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ధన్‌బాద్‌లో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు చేసినా.. ఆ కోర్సులకు డిమాండ్ లేకపోవడంతో ఈ వర్సిటీని మూసివేసి, ఆ తర్వాత ఐఐటీగా అప్‌గ్రేడ్ చేశారు. మైనింగ్ వర్సిటీకి బదులు ఎర్త్‌సైన్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఉపాధి కల్పించే స్థాయికి మహిళా సంఘాలు

స్త్రీ నిధి 12వ సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాలు పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగాయని మంత్రి ధనసరి అనసూయ సీతక్క కొనియాడారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో బుధవారం జరిగిన స్త్రీ నిధి 12వ సర్వసభ్య సమావేశంలో సీతక్క మాట్లాడారు. ప్రస్తుతం స్త్రీనిధి బ్యాంకులో రూ.800 కోట్ల సేవింగ్స్ ఉన్నాయని, రూ.5,200 కోట్ల మూల నిధి ఉన్నదని తెలిపారు. మహిళలు బ్యాంకును ఏర్పాటు చేసుకొని ప్రభుత్వానికి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని కొనియాడారు. త్వరలోనే గోదాములు, మిల్లులను మహిళా సంఘాలకు అప్పగిస్తామని తెలిపారు. ఆహారశుద్ధి యూనిట్ల ఏర్పాటు కోసం ఇక్రిసాట్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నామని చెప్పారు. స్థానిక వనరుల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని, ఆపద వస్తే మహిళా సంఘాలు మేమున్నామంటూ ఆదుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం పెంచేందుకు శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజారు ఏర్పాటుచేసినట్టు గుర్తుచేశారు. స్త్రీ నిధి బ్యాంక్‌పై సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ రవీందర్‌రావు రూపొందించిన పాటను మంత్రి ఆవిష్కరించారు. మెరుగైన ఫలితాలను సాధించిన మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం తన వంతు బాధ్యతగా స్త్రీ నిధి బోర్డు రూ.22 కోట్లను అందజేసింది.

దళితబంధుకు 'కన్నం'!

మొదటిపేజీ తరువాయి...

యూనిట్ తీసుకుంటేనే బ్యాంకుల్లోని నిధులను విడుదల చేస్తామని లబ్ధిదారులకు హుకూం జారీ చేశారు. ఇదేమిటని సదరు లబ్ధిదారులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దలను ఏమనలేక అధికారులు కూడా కిమ్మనకుండా ఉండిపోయారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఒక్క కరీంనగర్ జిల్లావే రూ.281కోట్లు

దళితుల అభ్యున్నతి, ఆర్థిక ప్రగతి లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో దళిత కుటుంబానికి ఎలాంటి షరతులు లేకుండా, వచ్చిన, నచ్చిన ఉపాధి మార్గం ఎంచుకునేందుకు రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. పథకానికి సంబంధించి మొదటి, రెండవ విడత కలిపి 44వేల మందికి వర్తింపజేసింది. దాదాపు రూ.4,400 కోట్లను లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసింది. అందులో చాలామంది లబ్ధిదారులు రూ.10లక్షలతో ఒకే యూనిట్‌ను ఏర్పాటు చేసుకోకుండా, ఒకటికి మించి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో తొలుత బ్యాంకులోని కొంత మొత్తం నిధులతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన నిధులతో మరొక యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దళితబంధు లబ్ధిదారులకు బ్యాంకుల్లో నిల్వ ఉన్న నిధులను విడుదల చేయకుండా ఆదేశాలను జారీ చేసింది. దీంతో

మొదటి విడతలో ఎంపికైన 9,937 మందికి సంబంధించి రూ.324.75కోట్లు, రెండవ విడతలో ఎంపికైన 471మంది లబ్ధిదారులకు సంబంధించి 9.88 కోట్లు బ్యాంకుల్లోనే ఉండిపోయాయి. మొత్తంగా 10,408 మందికి సంబంధించిన రూ.334.63కోట్లు విడుదల కాకుండా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో ఉండిపోయాయి. ఎన్నికల తర్వాత ఆ నిధులను విడుదల చేయాలని లబ్ధిదారులు కోరినా సర్కారు పట్టించుకోలేదు. దాదాపు ఏడాదిపాటు లబ్ధిదారులు పోరాటం చేయడం, బీఆర్ఎస్ నేతలు ఒత్తిడి తీసుకురావడంతో ఎట్టకేలకు సర్కారు దిగివచ్చింది. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలోనే ఉండిపోయిన నిధులను విడుదల చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈ ఏడాది జనవరిలోనే ఆదేశాలను జారీచేసింది. కానీ దాదాపు 3నెలలు గడచినా ఇప్పటివరకు ఎక్కడా లబ్ధిదారులకు నిధులను విడుదల చేయలేదు.

తెరవెనుక ఓ మంత్రి..!

ప్రస్తుతం దళితబంధు నిధుల విడుదలకు సంబంధించిన వ్యవహారంలో గోల్‌మాల్ వెనక ఏకంగా ఓ మంత్రి ఉన్నాడని విశ్వసనీయ సమాచారం. సదరు మంత్రి తనకు సన్నిహితుడైన అధికారినే ప్రత్యేకంగా నియమించుకుని, వ్యవహారాన్ని చక్కబెడుతున్నారని అధికారులే చెప్తున్నారు. తమకు సంబంధించిన ఆటోమొబైల్ కంపెనీలు, తదితర పరిశ్రమలతో ముందుగా ఒప్పందం చేసుకున్నారని తెలుస్తున్నది. అందులోభాగంగా ప్రస్తుతం నిధుల విడుదలకు ఎదురుచూస్తున్న లబ్ధిదారులను వారివద్దకే పంపిస్తున్నారని, పెద్ద మొత్తంలో కమీషన్లను వసూలు చేస్తున్నారని సమాచారం. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని పేరు చెప్పడానికి లబ్ధిదారులు కోరారు.

చెప్పిన యూనిట్.. చెప్పినచోటే తీసుకోవాలి

నిధులు విడుదల చేసేందుకు సర్కారు అంగీకరించిందనే దళితబంధు లబ్ధిదారుల ఆనందం అంతలోనే ఆవిరయ్యింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలో 7634 మందికి రూ.281.84 కోట్ల నిధులపై కన్నేసిన ఓ అమాత్యుడు ఇప్పుడు లబ్ధిదారులకు కొత్త నిబంధనలను విధిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. వాస్తవంగా లబ్ధిదారుల అకౌంట్లలోకి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. లబ్ధిదారులు తన ఇష్టం వచ్చిన ఉపాధి యూనిట్‌ను ఎంచుకుని, అందుకు సంబంధించిన అంచనా వ్యయానికి సంబంధించిన కొటేషన్‌ను అధికారులకు అందజేయాలి. సదరు ఎంపీడీవో పరిశీలించి చెక్‌మెమోను జారీ చేసి కలెక్టర్‌కు పంపిస్తారు. కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారుడి బ్యాంకు అకౌంట్‌లోని నిధులను విడుదల చేయాలని బ్యాంకు మేనేజర్‌కు ప్రొసీడింగ్స్ ఇస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాంకు మేనేజర్ నిధులను విడుదల చేస్తారు. ఇదీ ప్రక్రియ. కానీ ఇప్పుడు ఆ మార్గదర్శకాలను తుంగలో తొక్కేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము ఇచ్చిన యూనిట్‌ను, అదీ ఎంపిక చేసిన చోటు నుంచే కొటేషన్‌ను తీసుకోవాలని, ఆ యూనిట్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అక్కడే తీసుకోవాలని షరతు విధిస్తున్నారని తెలుస్తున్నది. లేదంటే నిధులు విడుదల చేసేది లేదంటూ హుకుం జారీ చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని పలువురు లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కానీ ఈ తతంగం వెనక ప్రభుత్వ పెద్దలే ఉన్నారని, అధికారులు కూడా చేతులెత్తాశారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చారాణా పనికి బారాణా ప్రచారం!

- పతాకస్థాయికి ప్రభుత్వ పెద్దల ప్రచార ఆర్భాటం
- రైతు పథకాల లబ్ధిదారుల పేర్లతో ఊరూరా ఫ్లెక్సీలు
- సుమారు రూ.60 కోట్లకు పైగా ప్రజాధనం వ్యయం
- ప్రభుత్వంపై పథకాలు అందని రైతుల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ): 'పని తక్కువ.. ప్రచారం ఎక్కువ' ఈ నానుడి కాంగ్రెస్ సర్కారుకు సరిగ్గా సరిపోతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రుణమాఫీ, రైతుభరోసా అందిన రైతుల వివరాలను ప్రతీ గ్రామంలో మూడు చోట్ల ఫ్లెక్సీలపై ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ జిల్లాల వారీగా టెండర్లు పిలిచింది. ఓ వైపు చాలా పథకాలకు పైసల్లేవని, అమలు అసాధ్యమని ముఖ్యమంత్రి, మంత్రులు చెప్తున్నారు. కానీ కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం చేయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం పతాకస్థాయికి చేరిందని ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. రుణమాఫీ, రైతుభరోసా అందక తాము గోస పడుతుంటే పట్టించుకోకుండా.. గొప్పగా అమలు చేస్తున్నట్టు ఊరూరా ప్రచారం చేసుకోవడమేంటని రైతులు మండిపడుతున్నారు.

ఫ్లెక్సీలకే రూ.60 కోట్ల ఖర్చు!

రుణమాఫీ, రైతుభరోసాపై ప్రచారం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకోసం భారీమొత్తంలో ఖర్చు చేస్తున్నది. ఫ్లెక్సీల తయారీ కోసం ఏకంగా రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ నుంచి బడ్జెట్ కేటాయించినట్టు సమాచారం. ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 34,260 ఫ్లెక్సీలను తయారు చేసేందుకు, రూ.1.20 కోట్లను ఖర్చు చేయనున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆ నిధులతో మమ్మల్ని ఆదుకోవచ్చుగా!

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ప్రభుత్వం దగ్గర పైసల్లేవని, రాష్ట్రం దివాలా తీసిందని తరచుగా చెప్తున్నారు. మరోవైపు ప్రచారానికి కోట్లు ఖర్చు చేస్తుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రుణమాఫీ, రైతుభరోసా సగమే అమలు చేసి, లక్షల మందిని ఆదుకోకుండా ప్రచారమెందుకని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.